విశాలాంధ్ర నంద్యాల
www.visalaandhra.com
కర్నూలు, గురువారం 29, జూన్ 2023

# పేద కుటుంబంలోని పిల్లలు ఉన్నత చదువులు చదవాలన్న ఆశయమే అమ్మ ఒడి

**విశాలాంధ్ర - నంద్యాల :** పేద కుటుంబంలోని పిల్లలు ఉన్నత చదువులు చదవాలన్న సమున్నత ఆశయంతోనే రాష్ట్ర ముఖ్యమంత్రి జగనన్న అమ్మ ఒడి పథకాన్ని ప్రవేశ పెట్టారని, ఈ పథకం కింద జిల్లాలోని అర్హత కలిగిన తల్లులకు ఒక్కొక్కరికి రూ.15 వేలు చొప్పున 1,67,084 మంది విద్యార్థుల తల్లుల బ్యాంకు ఖాతాలో రూ.217.20 కోట్ల రూపాయల మొత్తాన్ని నేరుగా జమ చేశామని జిల్లా కలెక్టర్ డా. మనజిర్ జిలాని సమూన్ పేర్కొన్నారు. బుధవారం కలెక్టరేట్ లోని వైయస్సార్ సెంటినరీ హాల్ లో రాష్ట్రవ్యాప్తంగా 2022-23 విద్యా సంవత్సరానికి 4వ విడతగా ఒకటి నుంచి ఇంటర్ చదువుతున్న 83,15,341మంది విద్యార్థులకు అమ్మ ఒడితో లబ్ధి చేకూరుస్తూ కురుపాంలో కంప్యూటర్ బటన్ నొక్కి జమ చేసే కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ డా. మనజిర్ జిలాని సమూన్, ఎమ్మెల్సీ ఇసాక్ బాషా, మార్కెఫెడ్ చైర్మన్ పి.పి నాగిరెడ్డి, మైనారిటీ సంక్షేమ అభివృద్ధి సలహాదారు హబీబుల్లా, మున్సిపల్ ఛైర్పర్సన్ మాబున్నిసా, రాష్ట్ర హస్తకళల డైరెక్టర్ సునీతా అమృత్ రాజ్, డీఈఓ సుధాకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ డా. మనజిర్ జిలాని సామూన్ మాట్లాడుతూ నంద్యాల జిల్లాలో జగనన్న అమ్మ ఒడి పథకం కింద అర్హత కలిగిన తల్లులకు రూ. 217.20 కోట్ల రూపాయల మొత్తాన్ని నేరుగా జమ చేశామని జిల్లా కలెక్టర్ డా. మనజిర్ జిలాని సమూన్ పేర్కొన్నారు. పిల్లల చదువుకు పేదరికం అడ్డు కాకూడదన్న ప్రధాన ఉద్దేశ్యంతో రాష్ట్ర ప్రభుత్వం జగనన్న అమ్మ ఒడి పథకాన్ని ప్రవేశ పెట్టిందన్నారు. ప్రభుత్వం ఇస్తున్న ఆర్థిక సహాయాన్ని పేద విద్యార్థులు చక్కగా సద్వినియోగం చేసుకొని చదువులో రాణించాలని విద్యార్థులకు కలెక్టర్ హితబోధ చేసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం జిల్లా కలెక్టర్, మార్క్ ఫెడ్ చైర్మన్, మున్సిపల్ చైర్ పర్సన్ తదితరుల చేతుల మీదుగా విద్యార్థులు, విద్యార్థుల తల్లులకు చెక్కును అందజేశారు.

## మరొక అవకాశం ఇవ్వాలి

**విశాలాంధ్ర - నంద్యాల :** పిఎస్ హెచ్ఎంలకు సబ్జెక్టు కన్వెన్షన్ కొరకు మరొక అవకాశం ఇవ్వాలని ఎస్టీయు రాష్ట్ర సహాధ్యక్షులు చంద్రశేఖర్ కోరారు. ఎస్టీయు జిల్లా కార్యాలయంలో జిల్లా అధ్యక్షులు అజాంబేగ్ అధ్యక్షతన ముఖ్య నాయకుల సమావేశం జరిగింది.రాష్ట్ర సహాధ్యక్షులు చంద్రశేఖర్ మాట్లాడుతూ సాధారణ బదిలీల సందర్భంగా పిఎస్ హెచ్ఎంలను అదే మండలంలో విద్యారుల సంఖ్య ఆరోహణ క్రమంలో కొనసాగిస్తామని తెలిపి, అనుకోకుండా బదిలీలలో వారి స్థానాలను తప్పనిసరి స్థానాలుగా పరిగణించడంతో వారు జిల్లాలోని సుదూర ప్రాంతాలకు బదిలీ కావడం జరిగిందన్నారు. పిఎస్ హెచ్ఎంలకు ఆయా సబ్జెక్టులలో కన్వర్షన్ కొరకు మరొక అవకాశం ఇవ్వాల్సిందిగా ఎస్టీయూ సంఘ పక్షాన డిమాండ్ చేయడమైనది. జిల్లా ప్రధాన కార్యదర్శి డి.మౌలాలి, రాష్ట్ర ఉపాధ్యక్షులు గోపాలకృష్ణ, దేవేంద్రారెడ్డి, సుబ్బయ్య, ప్రసాద్, బాలసుబ్బయ్య, నాగేంద్రకుమార్, నాగేశ్వర్ నాయక్ లు పాల్గొన్నారు.

## పెండింగ్ ఖిల్లులు వచ్చేలా చూడండి

**విశాలాంధ్ర - చాగలమర్రి :** గ్రామాల్లో హౌసింగ్ పరధిలో గృహ నిర్మాణాలు చేపడుతున్న లబ్దిదారులకు ఎన్ఆర్ఈజిఎస్‌లో పెండింగ్‌లో ఉన్న ఖిల్లులు త్వరితగతిన వచ్చేలా చర్యలు తీసుకోవాలని హౌసింగ్ డిఈ నాగరాజు తెలియజేశారు. చాగల మర్రి ఎంపిడీఓ కార్యాలయంలో ఎంపిడీఓ మహబూబ్‌దౌలా ఆధ్వర్యంలో ఇంజనీరింగు సహాయకులు, ఉపాధి, హౌసింగ్ సిబ్బందితో బుధవారం సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో డిఈ మాట్లాడుతూ గృహ నిర్మాణాలు చేపట్లటిన బ్దిదారులకు ఇంకా పెండింగ్‌లో ఉన్న ఉపాధి నిధులకు సంబంధించిన రూ.23వేలు వెంటనే వచ్చేలా చర్యలు తీసుకో వాలని కోరారు. జగనన్న లే అవుట్లలో గృహ నిర్మాణాలు జులై 15నాటికి పూర్తి అయ్యేలా కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో హౌసింగ్ ఏఈ షఫివుల్లా,ఏపిఓ నిర్మల, హౌసింగ్ సిబ్బంది, సచివాలయాల ఇంజనీరింగు సహాయకులు పాల్గొన్నారు.

## సాయిబాబా గుడికి భారీ విరాళం

**విశాలాంధ్ర - డోన్ రూరల్ :** పట్టణ శివారులో నిర్మిస్తున్న సాయిబాబా గుడికి టీడీపీ నియోజక వర్గ ఇన్‌చార్జి ధర్మవరం సుబ్బారెడ్డి కుటుంబ సభ్యులు, సోదరులు 25,00,000 లక్షల రూపాయలు భారీ విరాళం అందించారు. ఈ సంధర్భంగా సుబ్బారెడ్డి మాట్లాడుతూ దైవ కార్యక్రమానికి తన వంతు సాయం చేయడం సంతోషంగా ఉందని తెలిపారు. ప్రతి ఒక్కరూ తనకు తోచిన విధంగా భగవంతుని కోసం తమకు తోచిన విధంగా సాయం చేసి భగవంతుని కృపా కటాక్షాలు పొందాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బి.వి.రమణ గౌడ్ సాయిబాబా కమిటీ సెక్రటరీ సాయిబాబా కమిటీ సభ్యులు ఆలా రమణ సాయిబాబా కమిటీ సభ్యులు కొండా సురేష్ ,కందుకూరి పార్థసారథి, విజయ్ భట్, శ్రీరాములు,ఆలా మల్లిఖార్జునరెడ్డి, నందిగాం రామచంద్రరావు, మోహన్ రెడ్డి తదితరులున్నారు.

## ఆటోనగర్ ప్రారంభం

**విశాలాంధ్ర - బేతంచెర్ల రూరల్ :** పట్టణ శివారులోని అయ్యల చెరువులో రాష్ట్ర ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి ఆటో నగర్ ను ప్రారంభించారు. బుధవారం ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మెకానిక్ సోదరులు అద్దె భవనాలు, ట్రాఫిక్ తో ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, వారి సమస్యలను పరిష్కరించాలన్న సదుద్దేశంతో 26 హెక్టార్లలో ఆటో నగర్ ను ఏర్పాటు చేయబోతున్నామన్నారు.మొదటి విడతగా 6.90 ఎకరాలలో ప్రారంభిస్తున్నామని ,ప్రతి మెకానిక్ సోదరుకి 5 సెంట్ల స్థలంలో షెడ్లు ఏర్పాటు చేసుకొని,జీవనాన్ని కొనసాగించాలని తెలిపారు. అంతే కాకుండా మండలాన్ని అభివృద్ధి పథంలో అన్ని విధాలుగా చేస్తున్నామని తెలిపారు. వీటితో పాటు మండల పరిధిలోని కే.కే.కొట్టాల గ్రామ సమీపాన సహజ సిద్ధంగా ఏర్పడిన బిళ్ళ సర్గం గుహలను మంత్రి పరిశీలించి, పర్యాటక కేంద్రంగా ఏ విధంగా అభివృద్ధి చేయవచ్చునో తెలుసుకుంటున్న సందర్భంలో ఒక్క సరిగా తేనెటీగలు దాడి చేశాయి. ఆర్డీవో వెంకట రెడ్డి, నగర్ పంచాయతీ చైర్మన్ చలం రెడ్డి, తహశీల్దార్ నరేంద్ర నాథ్ రెడ్డి, సీనియర్ నాయకులు బాబుల్‌రెడ్డి, వైస్ ఖాజా,మూర్తుజ వలి, నాగరాజు,దస్తగిరి,మద్దిలేటి స్వామి దేవస్థానం చైర్మన్ రామ చంద్రుడు,పిఏ లు ప్రతాప్ రెడ్డి, శ్రీనివాస రెడ్డి,డీఎస్పీ శ్రీనివాస్ రెడ్డి,సీఐ ప్రియతమ్ రెడ్డి,అధిక సంఖ్యలో సంబంధిత శాఖల అధికారులు, వైసీపీ కార్యకర్తలు పాల్గొన్నారు.

## సీసీ రోడ్డు పనులు ప్రారంభం

**విశాలాంధ్ర.- నందికొట్కూరు :** నందికొట్కూరు పట్టణంలోని 20వ వార్డు రామాలయం వీధి నందు సిసి రోడ్డు పనులను కౌన్సిలర్ హమీద్మియ బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నందికొట్కూరు పట్టణ అభివృద్ధే భాగంగా ఏపీ షాప్ చైర్మన్ బైరెడ్డి సిద్ధార్థ రెడ్డి ఆదేశాల మేరకు మున్సిపల్ చైర్మన్ దాసి సుధాకర్ రెడ్డి సహకారంతో పట్టణంలోని 20వ వార్డు నందు గడపగడప మన ప్రభుత్వ కార్యక్రమం నిధులలో నుంచి సుమారు 8 లక్షల నిధులతో సిసి రోడ్ల నిర్మాణ పనులను ప్రారంభించి పనులు చేపట్టడం జరిగిందన్నారు.

# విద్యుత్ ఉద్యమాన్ని జయప్రదం చేయండి

**విశాలాంధ్ర - నంద్యాల :** వామపక్ష పార్టీల పిలుపుమేరకు ఈనెల 30న నంద్యాల పట్టణంలోని విద్యుత్ కార్యాలయం దగ్గర ధర్నా నిర్వహించడం జరుగుతుందని సీపీఐ పట్టణ కార్యదర్శి కె. ప్రసాద్ తెలిపారు. సీపీఐ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో సీపీఐ పట్టణ కార్యదర్శి కె. ప్రసాద్, సహాయ కార్యదర్శి జి. సోమన్న, ఏఐటీయూసీ పట్టణ కార్యదర్శి డి.శ్రీనివాసులు, ఏఐఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు సురేష్, నాయకులు సుబ్బరాయుడు, కలాంభాష, మాభాష తెలిపారు. వారు మాట్లాడుతూ రాష్ట్రంలోని ఐదు కోట్ల మంది ప్రజానీకంపై రాష్ట్ర ప్రభుత్వం విద్యుత్ భారం మోపడం బాధాకరమన్నారు. బీజేపీకి వంత పాడుతూ రాష్ట్రంలో రైతులకు ఇబ్బంది కలిగించే వ్యవసాయ పంపుసెట్లకు మీటర్లు పెట్టేందుకు అంగీకరించారన్నారు. బీజేపీ ప్రాంతా రాష్ట్రాలు కూడా ఈ విధానాన్ని వ్యతిరేకిస్తుంటే జగన్ ప్రభుత్వం వంత పాడడం విడ్డూరంగా ఉందన్నారు. విద్యుత్ కార్యాలయం దగ్గర జరిగే ధర్నాలో అందరూ పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

**నందికొట్కూరు :** ఈనెల 30న సీపీఐ ఆధ్వర్యంలో జరిగే విద్యుత్ ఉద్యమాన్ని జయప్రదం చేయాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు రఘురాంమూర్తి తెలిపారు. బుధవారం స్థానిక పటేల్ సెంటర్‌లో విద్యుత్ సర్దుబాటు చార్జీల పేరుతో పెంచిన కరెంట్ బిల్లులను తగ్గించాలని సీపీఐ తాలుకా సమితి ఆధ్వర్యంలో సంతకాల సేకరణ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఇప్పటివరకు గత ప్రభుత్వాలు రెండేళ్లకు మూడేళ్లకు కరెంటు చార్జీలు పెంచే వారిని మోడీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక మోడీ ఆదేశాలకు లొంగిపోయిన జగన్ ప్రభుత్వం ప్రతి నెల వంటగ్యాస్ లాగానే కరెంట్ ఛార్జీలు పెంచడానికి ఆదేశాలు ఇచ్చారని కరెంటు బిల్లులే కాకుండా ఫిక్స్ చార్జీలు కస్టమర్ కేర్ చార్జీలు ఇలా రకరకాల పేర్లు పెట్టి జనాన్ని పీల్చిపిప్పి చేస్తున్నారన్నారు. అసలు చార్జీల కంటే కొసరు చార్జీలు ఎక్కువయ్యాయని ప్రపంచంలో కరెంటు చార్జీలు పూర్తిగా తగ్గాయని, ఒకనాడు సోలార్ విద్యుత్ యూనిట్ 12రూపాయలు ఉండగా నేడు రెండు రూపాయలకు పడిపోయిందని నిజంగా కరెంటు చార్జీలు తగ్గించాలని అయినా తగ్గించకుండా ఎందుకు పెంచుతున్నారన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల విధానాలే కారణమన్నారు. ఇప్పుడు తాజాగా స్మార్ట్ మీటర్లు తయారు చేసే కంపెనీని ఆదాని ప్రారంభించారని వ్యవసాయ పంప్స్ చెట్లకు మీటర్లు బిగించి ఉచిత విద్యుత్తుకు ఎసరు పెట్టబోతున్నారన్నారు. 200 యూనిట్ల లోపు వాడే వారందరికీ ఉచిత విద్యుత్ ఇస్తానని మాట చెప్పిన జగన్ మోసం చేశారనారు. ఎస్సీ ఎస్టీలకు ఉచిత విద్యుత్ క్రమంగా నిరుగారుస్తున్నారన్నారు.ఈ విధానాలను నిరసిస్తూ 30న జరిగే విద్యుత్ ఉద్యమంలో ప్రజల అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.అల్లంపూర్ మండల సీపీఐ కార్యదర్శి బాబు, ఏఐఎస్ఎఫ్ నంద్యాల జిల్లా అధ్యక్షులు శ్రీనివాసులు, ఏఐఎస్ఎఫ్ తాలూకా సమితి నాయకులు మహానంది, వినోద్, వీరేంద్ర పాల్గొన్నారు.

## రాష్ట్రాన్ని దివాళా తీసిన వైసీపీని గద్దె దించండి

**విశాలాంధ్ర - నంద్యాల :** రాష్ట్రాన్ని దివాళా తీసిన వైసిపి ప్రభుత్వాన్ని గద్దె దించి మీ భవిష్యత్తుకు గ్యారెంటీ ఇచ్చే తెలుగుదేశం పార్టీని రాబోయే ఎన్నికలలో అత్యధిక మెజారిటీతో గెలిపించాలని నంద్యాల మాజీ ఎమ్మెల్యే భూమా బ్రహ్మానందరెడ్డి ప్రజలకు పిలవునిచ్చారు. రాష్ట్ర వ్యాప్తంగా తెలుగుదేశం పార్టీ నిర్వహిస్తున్న మీ భవిష్యత్తుకు గ్యారంటీ కార్యక్రమంలో భాగంగా నంద్యాల మండలం బిల్లలపురం గ్రామంలో మాజీ ఎమ్మెల్యే భూమా పల్లెనిద్ర కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామానికి చేరుకున్న భూమాకు తెలుగుదేశం కార్యకర్తలు ఘనస్వాగతం పలికారు.అనంతరం మీ భవిష్యత్తుకు గ్యారంటీ పేరుతో వున్న బ్యానర్ తో గ్రామంలో ర్యాలీ నిర్వహించి ఇంటింటికీ తిరిగి ప్రజల సమస్యలు తెలుసుకున్నారు. తెలుగుదేశం ప్రభుత్వం అధికారంలోకి రాగానే భవిష్యత్తుకు గ్యారంటీ ఇస్తామని మహిళలకు మూడు గ్యాస్ సిలిండర్లు ఉచితంగా ఇస్తూ 18ఏళ్ళ నిండిన ప్రతి మహిళకు అకౌంట్ లో నెలకు 15వందలు, ప్రతి ఇంట్లో స్కూల్ కి వెళ్ళే చిన్నారులకు ఏడాదికి 18వేలు, రైతన్నలకు ఏడాదికి 20వేలు ఇస్తామన్నారు. రాబోయేది తెలుగుదేశం ప్రభుత్వమని 2024 ఎన్నికలలో గెలుపు కోసం ప్రతి కార్యకర్త కృషి చేయాలని భూమా పిలుపు ఇచ్చారు. తెలుగుదేశం నాయకులు చిలకల చెన్నయ్య, శ్రీనివాసరెడ్డి, రామకృష్ణా రెడ్డి, ప్రతాప రెడ్డి, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## ఇష్టపడి చదివితే మంచి ఫలితాలు

**విశాలాంధ్ర - బనగానపల్లి :** విద్యార్థులు కష్టపడి కాకుండా ఇష్టపడి చదివితే మంచి ఫలితాలు సాధించవచ్చని బనగానపల్లె పట్టణ పట్టణ మాజీ సర్పంచ్ బిసి రాజారెడ్డి అన్నారు. ఈనెల 6వ తేదీన బిసి రాజారెడ్డి సొంత నిధులతో పదో తరగతి ఫలితాల్లో పాఠశాల స్థాయిలో ప్రథమ ర్యాంకు సాధించిన విద్యార్థికి రూ. 5000, మండల స్థాయిలో ప్రథమ ర్యాంకు సాధించిన విద్యార్థికి రూ.15000 చొప్పున నగదు ప్రోత్సాహక బహుమతి, మెమెంటోలు అందజేసి ఘనంగా సత్కరించారు.కొన్ని అనివార్య కారణాలవల్ల కోయిలకుంట్ల జిల్లా పరిషత్ ఉర్దూ హైస్కూ ల్‌లో విద్యనభ్యసించిన ఎం.అర్షియా అనే విద్యార్థిని ఈ కార్యక్రమానికి హాజరు కాలేదు. సదరు విద్యార్థిని బుధవారం బనగానపల్లె వచ్చి బిసి రాజారెడ్డిని సంప్రదించడంతో వెంటనే స్పందించిన ఆయన ఎం.అర్షియాకు రూ.5000 నగదుతో పాటు మెమెంటో అందజేసి సత్కరించారు. అర్షియా ఉర్దూ పాఠశాలలో విద్యనభ్యసించి పదోతరగతి ఫలితాల్లో 85% మార్కులు సాధించడం అభినందించదగ్గ విషయమన్నారు.వెల్కమ్ ఫోటో స్టూడి యో అల్తాఫ్,ఫోటోగ్రాఫర్‌నసీమ్,కోవెలకుంట్లసాధిక్,విద్యార్థినితండ్రిపాల్గొన్నారు

## అనారోగ్యంతో వాచ్ మెన్ మృతి

**విశాలాంధ్ర - గడివేముల :** మండల పరిధిలోని గని గ్రామంలో ఉన్న విద్యుత్ సబ్ స్టేషన్ లో వాచ్‌మెన్‌గా పనిచేస్తున్న మధు(30) కొద్దిసేపటి క్రితం అనారోగ్యంతో మృతి చెందాడు. విషయం తెలిసిన 3045 యూనియన్ స్టేట్ నాయకులు శరత్ కుమార్ ప్రగాఢ సంతాపం తెలియజేసారు. 3045 యూనియన్ తరుపున మధు కుటుంబానికి అండగా ఉంటామని హామీ ఇచ్చారు. మృతుడు మధుకి భార్య, కొడుకు,కూతురుఉన్నారు. చిన్న వయసులో మధు అనారోగ్యం తో మృతి చెందడంతో గని గ్రామంలో విషాద ఛాయలు అములుకున్నాయి.

## గుంతల మయమైన రోడ్డు

**విశాలాంధ్ర - వెలుగోడు :** వెలుగోడు నుండి వెంపేట మీదుగా బానుముక్కల టర్నింగ్ వరకు గల రహదారి గుంతల మయమై అధ్వాన్న స్థితిలో ఉంది. ఈ రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరు అయినట్లు సమాచా రం. కానీ పనులు మాత్రం చేపట్ట లేదు.ప్రయాణ మంటే అస్తవ్యస్తంగా నల్లేరు మీద నడక లాగా తయార్నైనది. అధికారులు, నాయకులు రోడ్డు నిర్మాణం పనులు చేయించే పనిలో వెనుకంజలో వున్నారు. ఇకనైనా అధి కారులకు నాయకు లకు చిత్తశుద్ధి ఉంటే అభివృద్ధి పథంలో నడిపేందుకు కృషి చేయాలని సీపీఐ (యంఎల్)ఆర్ ఐ పార్టీ జిల్లా కార్యదర్శి గాలి రవిరాజ్ డిమాండ్ చేశారు.

## టైరు పేలి కారు బోల్తా ...వ్యక్తికి స్వల్ప గాయాలు

**విశాలాంధ్ర - చాగలమర్రి :** మండలంలోని పెద్దబోధనం గ్రామ సమీపంలోని 40వ జాతీయ రహదారిపై కారు టైరు పేలి బోల్తాపడిన ఘటన బుధవారం చోటు చేసుకుంది. స్థానికుల వివరాల మేరకు హైదరాబాదు నుంచి కారులో మస్తాన్ కుటుంబీకులతో స్వగ్రామమైన రాజంపేటకు బక్రీద్ పండుగ చేసుకునేందుకు బయల్దేరారు. మండలంలోని పెద్దబోధనం గ్రామ సమీపంలోని కాశినాయన ఆశ్రమం సమీపానికి చేరుకోగానే కారు ముందు భాగం టైరు పేలి బోల్తాపడింది. కారు నుజ్జునుజ్జైంది. కారులోని మస్తాన్ కు స్వల్పగాయాలయ్యాయి.మిగిలినవారు సురక్షితంగా బయటపడ్డారు. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని విచారణ చేపట్టారు.

## ఘనంగా పివి నరసింహారావు జయంతి వేడుకలు

**విశాలాంధ్ర - నంద్యాల :** ఆంధ్రప్రదేశ్ బ్రహ్మణ సంక్షేమ సమాఖ్య రాష్ట్ర కార్యదర్శి నగరడోణ సుధీర్ ఆధ్వర్యంలో పి.వి. నరసింహారావు జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. శోభ హోటల్ రాఘ వేంద్ర, తిరుమల ఫర్నిచర్స్ రేణుక, రామూర్తి, సుబ్బారావు, బాలగంగాధర శాస్త్రి, రవిశంకర, నందాలాల్ తదితరులతొ ప్రారంభించారు. రాష్ట్ర కార్యదర్శి నగరడోణ సుధీర్ మాట్లడుతు అపర చాణక్యుడు, మేధావి భహు భాషా కొవిధుడు పి.వి. నంసింహారావు నంద్యాల నుండి గెలుపొంది భారత ప్రధానిగా ఎన్నో సంస్కరణలు తీసుకువచ్చారని కొనియాడారు. చంద్రశేఖర్, మనొహర్, సాయిక్రిష్ణ, మణికంత, మల్లిక, శ్రీలక్ష్మీ తదితరులు పాల్గొనారు.

## గ్రంథాలయాన్ని తనిఖీ

**విశాలాంధ్ర - శిరివెళ్ల :** మండల కేంద్రంలోని గ్రంథాలయాన్ని బుధవారం జిల్లా కార్యదర్శి ప్రకాష్ తనిఖీ చేశారు. రికార్డుల నిర్వహణ, గ్రంథాలయ నిర్వహణ, ప్రముఖుల విజిట్ పుస్తకం, వేసవి విజ్ఞాన కార్యక్రమాల నిర్వహణ, తదితర అంశాలను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. తాజా నోటిఫికేషన్ల ఉద్యోగ ఉపాధి విజ్ఞాన అవకాశాలు గల ప్రధాన మైనటువంటి పుస్తకాల అవసరత గురించి గ్రంథాలయ అధికారిని సుజాత జిల్లా అధికారి దృష్టికి తీసుకువెళ్లారు. సిరివెళ్ల లో గ్రంథాలయానికి సొంత భవనం ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వ స్థలం కేటాయించాల్సిన అవసరం సంబంధిత అధికారులపై ఉందని స్థలం చూపించిన వెంటనే నిర్మాణానికి కృషి చేస్తామని ఈ సందర్భంగా జిల్లా ప్రధాన కార్యదర్శి ప్రకాష్ తెలియజేశారు.

## ప్రజల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

**విశాలాంధ్ర - మిడుతూరు :** రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన గడపగడపకు మన ప్రభుత్వం అనే కార్యక్రమంలో ఎమ్మెల్యే ఆర్థర్ ప్రజల సమస్యలను తెలుసుకొని వాటిని పరిష్కరించే దిశగా అడుగులు ముందుకు వేస్తూ నిరంతర శ్రామికుడిగా పనిచేస్తూ గడప గడపలో ఆర్థర్ సరిలేరు నీకెవ్వరు అంటూ జనం చేత జై కొడుతూ ముందుకు సాగుతున్నారు. బుధవారం మండల పరిధిలోని పైపాలెం,నాగలూటి గ్రామాల్లో గడప గడపకు మన ప్రభుత్వం అనే కార్యక్రమానికి ఎమ్మెల్యే హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గ్రామంలో ప్రతి ఇంటికి వెళ్లి లబ్ధిదారులకు ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు చదివి వినిపిస్తూ అవ్వ బాగున్నావా... తాతయ్య పెన్షన్ వస్తుందా.. అమ్మ అమ్మఒడి పడిందా... అక్క వైఎస్ఆర్ చేయూత అందిందా అంటూ ప్రతి ఒక్కరిని ఆప్యాయంగా పలకరిస్తూ ముందుకు సాగుతున్నారు. అనంతరం అంగన్వాడీ కేంద్రాన్ని తనిఖీ చేశారు.. పిల్లలకు పౌష్టికాహారం అందించాలని, గర్భవతులకు, తల్లులకు గుడ్లు, వైయస్ఆర్ కిట్టు అందే విధంగా చూడాలని వారికి సూచించారు. ఎంపీడీవో జి. నాగ శేషాచల రెడ్డి,తహశీల్దార్ ప్రకాష్ బాబు, వ్యవసాయ అధికారి పీరు నాయక్, ఈవో ఆర్డీ ఫక్రుద్దీన్ , విద్యుత్ శాఖ ఏఈ క్రాంతి కుమార్, ఏపీవో జయంతి ,వైసీపీ నాయకులు శ్రీనివాసరెడ్డి, ఇనాయత్ తుల్లా, కడుమూరు గోవర్ధన్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘంలో జరగకుండా మిడుతూరు ఎస్సై మారుతి శంకర్ ఆధ్వర్యంలో పోలీస్ బందోబస్తు నిర్వహించారు.

## సేంద్రియ ఎరువులు వాడాలి

**విశాలాంధ్ర - డోన్ :** సేంద్రియ ఎరువులు వాడాలని కేవీకే శాస్త్రవేత్తలు రమణయ్య, సుధాకర్ అన్నారు. కృషి విజ్ఞాన కేంద్రం, యాగంటిపల్లి డోన్ మండల పరిధిలో కామాగాణిగుంట్ల రైతు భరోసా కేంద్రంలొ మండల వ్యవసాయ అధికారి అబ్దుల్ షఫీ ఆధ్వర్యంలో వర్షాకాలం సన్నద్ధ కార్యక్రమం నిర్వహించారు. కేవీకే శాస్త్రవేత్తలు రమణయ్య, సుధాకర్ మాట్లాడుతూ భూసారా పరీక్షల ఆవస్యకతను, మట్టినమునా తీసే పద్ధతిని పొలం లొ చేసి చూపించారు. నేలలో కర్బన శాతం పెంచాలంటే తప్పకుండ పశువుల ఎరువులు వెయ్యాలని సూచించారు. కేవీకేలొ వివిధ పంటలకు సంబంధించిన నూతన రకాల విత్తనాలు అందుబాటులో ఉన్నాయని, అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కేవీకే తరుపున సబ్ సెంటర్ ఏర్పాటు చేసి వారి సేవలను ఈ ప్రాంతానికి విస్తృతం చేస్తామని తెలిపారు. వీలైతే రైతు సంఘాలుగా ఏర్పడి సొంతంగా పంటకు విలువ జోడించి అమ్మితే అధిక ఆదాయం పొందగలరని సూచించారు.అదేవిదంగా మండల వ్యవసాయ సలహామండలి చైర్మన్ మట్లాడుతూ శాస్త్రవేత్తలు సూచించిన సాంకేతిక పరిజ్ఞానాన్ని మరియు సలహాలను పాటిస్తు మంచి లాభాలను పొందాలని కోరడమైనది.కేవీకే శాస్త్రవేత్తలు రవి గౌడ్, మరియు గ్రామ రైతులు పాల్గొన్నారు.

## విద్యుత్ సబ్ స్టేషన్ ఏర్పాటు చేయాలి

**విశాలాంధ్ర - జూపాడుబంగ్లా :** మండలంలోని భాస్కరపురం గ్రామంలో చిన్న తేలికపాటి ఈదురు గాలులు, వర్షాలు వస్తే గ్రామం అంధకారమేనని, తక్షణమే శాశ్వత పరిష్కారం కోసం మిని విద్యుత్ సబ్ స్టేషన్ ఏర్పాటు చేయాలని సిపిఐ జిల్లా నాయకులు ఎం.రమేష్ బాబు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం భాస్కరపురం గ్రామంలో యువకులతో కలిసి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భాస్కరపురం గ్రామంలో దాదాపు 1500 మంది జనాభా వున్నారని, శ్రీశైలం నీటిమనక గ్రామమని చుట్టుపక్కల ఎలాంటి సబ్ స్టేషన్ లేకపోవడం వల్ల మండ్లెం గ్రామంలో ఉన్న సబ్ స్టేషన్ పై ఆధారపడి తీగల ద్వారా విద్యుత్తు వస్తుందని చిన్నపాటి వర్షం వచ్చిన ఈదురు గాలులు వీచిన విద్యుత్ లేక అంధకారంలో ఉంటుందని వారన్నారు. గతంలో ఈ విషయాన్ని విద్యుత్ ఏ డి ఏ దృష్టికి తీసుకెళ్లామని అయినా సమస్య పరిష్కారం కాలేదని తక్షణమే భాస్కరపురం గ్రామానికి మినీ విద్యుత్తు సబ్ స్టేషన్ ఏర్పాటు చేసి శాశ్వత పరిష్కారం చూపాలన్నారు. అధికారులు పాలకుల నిర్లక్ష్యం కారణంగా విద్యుత్ లేకపోవడంతో చిన్నపిల్లలు వృద్ధుల పరిస్థితి అగమ గోచరంగా మారిందని కనీసం చదువుకోవడానికి లైట్లు కూడా లేని పరిస్థితి ఉందన్నారు.మండలంలో నెలకొన్న విద్యుత్ సమస్యలు అధికారుల దృష్టికి తీసుకుపోతున్న స్పందించడం లేదన్నారు. విద్యుత్ బిల్లులు మాత్రం వేలల్లో వసూలు చేస్తున్నారని విద్యుత్తు కల్పించడంలో విఫలం చెందరన్నారు.ఈ విషయంపై త్వరలో విద్యుత్ సబ్టేషన్ ముందు ధర్నా కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు వారు తెలిపారు. మాజీ ఏఐఎస్ఎఫ్ నాయకులు చంటి, రవి, శివ,యువజన సమైక్య నాయకులు విక్రమ్, రమేష్, అజయ్, పృధ్వి, రమేష్ పాల్గొన్నారు.

## అర్హులందరికీ పథకాలు వర్తించాలి

**విశాలాంధ్ర - ఉయ్యాలవాడ :** అర్హత ఉండి సాంకేతిక కారణాల వల్ల సంక్షేమ పథకాలు అందని లబ్ధిదారులకు పథకాలు వర్తించేలా చేయడమే జగనన్న సురక్ష లక్ష్యమని డిఎల్‌డిఓ జనార్ధనరావు అన్నారు. బుధవారం మండలంలోని తుడుమల దిన్నె గ్రామంలో జగనన్న సురక్ష పథకంలో భాగంగా వాలంటీర్లు, సచివాలయ ఉద్యోగులు, కన్వీనర్లు ఇంటింటా చేపట్టిన సర్వే కార్యక్రమాన్ని డిఎల్డిఓ, టాస్క్ ఫోర్స్ ప్రతినిధి రవికుమార్ రెడ్డిలు పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ ఇంటింటికి వెళ్లి ప్రభుత్వం ఉచితంగా అందజేసే పదకొండు రకాల ధ్రువీకరణ పత్రాలపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. జూలై 1వ తేదీ నుండి చేపట్టనున్న జగనన్న సురక్ష పథకాన్ని విజయవంతం చేసుకునేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీవో ఉమామహేశ్వరరావు, ఇఓపిఆర్డి వెంకటేశ్వరరావు, పాల్గొన్నారు.


**OFFICE OF THE BETHAMCHERLA NAGARAPANCHAYAT**
**e-Procurement Tender Notice**

The Municipal Commissioner, Bethamcherla Nagarapanchayat, Nandyal Dist., Andhra Pradesh State.,inviting Tenders vide, Tender Notice No.
**Roc.No. 597/GGMP BTC-6/2023/ -EI, Dated. 28-06-2023** in Bethanmcherla Nagarapanchayat.

| | |
|---|---|
| 1. Total No. of works | :03 work under GGMP 2022-23. |
| 2. Total value of works | : 12.50 Lakhs under GGMP 2022-23. |
| 3. Name of Works | :Laying of CC Drain in Bugganipalle Locations inBethamcherlanp |
| The First call Bid can Download on AP e-Procurement portal from | 29-06-2023 to 13-07-2023 (15.30 Hrs) |
| Due date for submission of bid | 13-07-2023 @ (16:00Hrs). |
| Bid Opening Date | 13-07-2023 @ (16:30 Hrs). |

Please visit **www.apeprocurement.gov.in** portal for further details.
Name & address of the officers to Contact : Municipal Commissioner : 9110520903.
Municipal Engineer : 9493704730.

**MunicipalCommissioner,**
**Bethamcherla Nagarapanchayat**

**Pay water eharges & property tax and D&O trade license fees, eneroachment fees and cooperate in the Developmental Activities in Bethamcherla Nagarapanchayat.**

## అమ్మఒడి ద్వారా తల్లుల అకౌంట్‌లో డబ్బులు

**విశాలాంధ్ర బ్యూరో - కర్నూలు :** జగనన్న అమ్మ ఒడి పథకం ద్వారా తల్లులకు అండగా ఉండేందుకు గాను 2022-23 విద్యా సంవత్సరానికి గాను రాష్ట్రంలోని 42,61,965 తల్లుల ఖాతాల్లో వరుసగా నాలుగోవ విడత ఆర్థిక సాయం రూ.6,393 కోట్ల రూపాయలను రాష్ట్ర ముఖ్య మంత్రి వర్యులు వైఎస్ జగన్ మోహన్ రెడ్డి పార్వతీపురం మన్యం జిల్లా కురుపాం నుండి బుధవారం ఉదయం బటన్ నొక్కి నగదు మొత్తాన్ని తల్లుల ఖాతాల్లో జమ చేసే మహోత్తర కార్యక్రమానికి శ్రీకారం చుట్టనున్నారు. బుధవారం కర్నూలు జిల్లాలో ఒకటో తరగతి నుండి ఇంటర్మీడియేట్ వరకు 2,42,241 మంది విద్యార్థుల తల్లుల ఖాతాలలో రూ.363.3615 కోట్లు నేరుగా జమ చేశారు.కర్నూలు మండల పరిధిలోని మిలిటరీ కాలనీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన జిల్లా స్థాయి కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా కలెక్టర్ డా.జి.సృజన, పాణ్యం శాసనసభ్యులు కాటసాని రాంభూపాల్ రెడ్డి, కోడుమూరు శాసనసభ్యులు జె.సుధాకర్, ఎంపీపీ వేంకటేశ్వరమ్మ, ఎంపీటీసీ జ్యోతి, గ్రామ సర్పంచ్ మాధురి, డిఈఓ రంగారెడ్డి, ఏపిసి వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

## ఓపిఎస్ సాధించేంతవరకు పోరాటాలు కొనసాగిస్తాం

**విశాలాంధ్ర - ఎమ్మిగనూరు :** రాష్ట్రంలోని సుమారు 19 లక్షల మంది ఉపాధ్యాయ ఉద్యోగ కార్మికుల పదవీ విరమణ తర్వాత వారి జీవితానికి ఎటువంటి భద్రతా, భరోసా లేని సిపిఎస్ విధానాన్ని రద్దు చేసి ఓపిఎస్ (పాత పెన్షన్ విధానం) సాధించేంతవరకు పోరాటాలు కొనసాగిస్తామని రాష్ట్రోపాధ్యాయ సంఘం ఎస్‌టియు జిల్లా ప్రధాన కార్యదర్శి టీ.కే.జనార్ధన పునరుద్ఘాటించారు. ముఖ్య మంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి తాను ప్రతిపక్షంలో ఉండగా అధికారంలోకి వచ్చిన ఏడు రోజులో సిపిఎస్ విధానాన్ని రాష్ట్రంలో రద్దు చేస్తామని హామీ ఇచ్చి స్వయంగా తానే ప్లకార్డులు ప్రదర్శించారని సిపిఎస్ ను రద్దుచేసి దాని స్థానంలో ఓ పి ఎస్ విధానాన్ని అమలు చేయకపోగా అది నమ్మి వారిని గెలిపించిన ఉపాధ్యాయ, ఉద్యోగ, కార్మికుల ను మోసగిస్తూ సిపిఎస్ స్థానంలో జిపిఎస్ (గ్యారెంటీ పెన్షన్స్) విధానాన్ని ప్రవేశపెట్టడం దుర్మార్గమైన చర్యని పేర్కొన్నారు. రాష్ట్రంలోని ఏ ఉద్యోగ ఉపాధ్యాయ కార్మికుడు ప్రభుత్వం ప్రవేశపెట్టదలచిన జిపిఎస్ విధానాన్ని ఒప్పుకోవడం లేదని సిపిఎస్ విధానానికి ప్రత్యామ్నాయం పాత పెన్షన్ విధానమనీ (ఓ పి ఎస్) దీనిని సాధించేం తవరకు ఎస్టియు ఉద్యమాన్ని తీవ్రతరం చేస్తుందని కలిసి వచ్చే ఉపాధ్యాయ , ఉద్యోగ సంఘాల ద్వారా ప్రభుత్వంపై ఒత్తిడి తేవడం జరుగుతుందని అవసరమైతే జాతీయస్థాయిలోని అన్ని కార్మిక కర్షక ఉపాధ్యాయ ఉద్యోగ సంఘాల ఆధ్వర్యంలో ఓ పి ఎస్ సాధనకై ఉద్యమిస్తుందని పేర్కొన్నారు. రాష్ట్ర మాజీ కార్యదర్శి బసవరాజు మాట్లాడుతూ సిపిఎస్ విధానంలో ఉద్యోగి జమ చేస్తున్న డబ్బుకు సమానంగా ప్రభుత్వం జమ చేయవలసిన సొమ్ము ఇంతవరకు ప్రభుత్వం సిపిఎస్ ఖాతాలకు జమ చేయలేదని తాను ప్రతి ఉద్యోగి సిపిఎస్ ఖాతా లకు చెల్లించవలసిన మ్యాచింగ్ గ్రాంట్ ను తప్పించుకోవడానికి ఈ జిపిఎస్ విధానాన్ని తెరపైకి తెచ్చిందని ఇది ఏ ప్రభుత్వ ఉద్యోగికి ఆమోదయోగ్యం కాదని తెలియజేశారు.బరాష్ట్రంలోని కాంట్రాక్ట్ ఉద్యోగులందరిని ఎటువంటి షరతులు లేకుండా రెగ్యులరైజ్ చేయాలని కోరారు. రాష్ట్ర కౌన్సిలర్లు అడివన్న, బాబయ్య, ఎల్లప్ప జిల్లా కౌన్సిలర్ చంద్రశేఖర్ ఎమ్మిగనూరు మండల అధ్యక్షులు ప్రధాన కార్యదర్శిలు సిహెచ్ తిమ్మన్న సురేష్ పాల్గొన్నారు.

## పీవీకి భారతరత్న ఇవ్వాలి

**విశాలాంధ్ర - ఎమ్మిగనూరు టౌన్ :** జిల్లా ఓబీసీ చైర్మన్ ఎం కాశీం వలి ఆధ్వర్యంలో ఎమ్మిగనూరు పట్టణంలో బుధవారం రోజున మాజీ ప్రధానమంత్రి వర్యులు పీవీ నరసింహారావు జయంతి వేడుకల సందర్భంగా ఒకేషనల్ కళాశాలలో పూలమాల వేసి నివాళులర్పించి, విద్యార్థులకు స్వీట్లు పంపిణీ చేయడం జరిగింది, కేంద్రం పివికి భారతరత్న ఇవ్వాలని తెలుగుజాతి ముద్దుబిడ్డ బహుభాషా గోవిందుడు పీవీ నరసింహారావు అని తెలియజేశారు. పీవీ నరసింహారావు ప్రధానమంత్రి హయాంలో అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టిన ఘనత ఆయనదని తెలిపారు. అనేక సంఘసంస్కరణ ప్రవేశపెట్టిన ఘనత ఆయనకే దక్కుతుందని తెలిపారు. అనేక పథకాలను జాతీయకరణ చేసిన ఘనత ఈయనదే . పేదల కోసం అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టారని తెలిపారు. తెలుగు రాష్ట్ర అభివృద్ధి కొరకు అనేక పథకాలు చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఎన్ ఎస్ యూ ఐ జిల్లా అధ్యక్షుడు వీరేష్ యాదవ్, అజయ్ విద్యార్థులు పాల్గొన్నారు.

## చర్చిలను కూల్చివేతలకు నిరసన

**విశాలాంధ్ర - కర్నూల్ లీగల్ :** మణిపూర్లో జరుగుతున్న హింసాత్మకమైన పరిస్థితులను విధ్వంసకరమైన పరిస్థితులను చర్చిలను కూల్చివేతలకు నిరసన తెలియజేయుట ద్వారా మణిపూర్ లోని ప్రజలు తిరిగి శాంతియుత వాతావరణంలో జీవించుటకు కర్నూలు జిల్లా క్రైస్తవ సోదరులు శాంతియుత నిరసన తెలియజేయడం జరిగింది. భారతదేశ అంటేనే శాంతిని కోరుకునే ప్రజలు పరమత సహనం కలిగిన ప్రజలు అని విశ్వం అంతా విశ్వసిస్తారు కానీ నేటి పాలకులు ఆ యొక్క నమ్మకాన్ని వమ్ము చేస్తూ భారతదేశము యొక్క ఔన్నత్యాన్ని దెబ్బతీస్తూ ప్రజల మధ్య భేదాభిప్రాయాలు సృష్టిస్తూ రాజకీయ ప్రయోజనం పొందాలని ప్రయత్నిస్తున్నారు. కావున శాంతియుత నిరసన ద్వారా ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డికి తెలియ జేయడం ఏమనగా క్రైస్తవుల పక్షాన మీరు మాట్లాడవలసిన సమయం వచ్చినది కావున ముఖ్యమంత్రి క్రైస్తవుల మనోభావాలు దెబ్బతింటున్నాయ మణిపూర్ ప్రజల యొక్క స్థితిని తీసుకెళ్లి సాధారణ పరిస్థితులు నెలకొల్పుటకు కృషి చేయాలని కోరుకుంటున్నాం. కర్నూల్ క్రైస్తవ నాయకులు కేజే.విజయ్ కుమార్ బేతపూడి సునీల్ ఎస్.జయ కాంత్ బి.జాషువా దానియల్ జెట్టి ప్రభుదాసు సోలోమోను వైయస్సార్ కాంగ్రెస్ నాయకులు బి.జాన్ విల్సన్ పాల్, బెనిడిట్ తదితర క్రైస్తవ నాయకులు క్రైస్తవ సోదరి సోదరులు పాల్గొనడం జరిగినది.

## విద్యార్థులను అభినందించిన టీజీ భరత్

**విశాలాంధ్ర - కర్నూలు :** మౌర్య ఇన్ ఛాంబర్‌లో టిజీ భరత్ టైక్వాండ పోటీలు సాధించిన విద్యార్థులు టీజీ భరత్‌తో కలిశారు ఆయన గెలుపొందిన విద్యార్థులకు.మెడల్స్ సర్టిఫికెట్స్ బుధవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాస్థాయిలో ఆడి రాష్ట్రస్థాయిలో ఎంపీ కావడం చాలా సంతోషకర విషయం తెలియ జేశారు. విద్యార్థులకు ప్రత్యేకత అభినందించారు. శివ శంకర్. మల్లేష్ విజయనగరంలో తిరుపతిలో మధుసూదన్ పోటీలకు సహకారాలు అందిస్తామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జి అబ్దుల్ ఆమిద్ టీడీపీ మైనార్టీ టౌన్ ప్రెసిడెంట్ మరియు వెంకటేశ్వర్లు మాట్లాడుతూ వచ్చేనెల తిరుపతిలో 1.2.3 విజయనగరంలో 15. 16 రోజులు పాల్గొన్న విద్యార్థులకు రోజు సాధనం చేయడం వలన ఆత్మ రక్షణతో పాటు అన్ని రంగంలో రాణిస్తారని తల్లిదండ్రులు చిన్నతనం నుంచి ఇలాంటి క్రీడలు సాధన చేయించాలని విద్యార్థులు బంగారు పతకం సాధించాలని కోరారు. రోహిత్. మధుసూదన్ శివ శంకర్ . మల్లేష్. సీనియర్ శిక్షకులు టి వెంకటేశ్వర్లు తల్లిదండ్రులు విద్యార్థులు పాల్గొనడం జరిగింది.

## ఆదేశాలను ధిక్కరించిన వారిపై కేసు నమోదు చేయాలి

**విశాలాంధ్ర - పెద్దకడబూరు :** మంత్రాలయం మండల పరిధిలోని సౌళహళ్లి గ్రామంలో గత 59 సంవత్స రాలుగా సర్వేనెంబర్ 19/లో 2. 89 ఎకరాల వ్యవసాయ భూమిని ముత్తమ్మ సాగు చేస్తున్నారని ఎమ్మార్పీఎస్ జిల్లా మాజీ కార్య వర్గ సభ్యులు బొగ్గుల తిక్కన్న తెలిపారు. బుధవారం ఆయన విలేఖరుల తో మాట్లాడుతూ గ్రామంలోని కొందరు 1996లో ఆ సర్వేనెంబర్‌లో పట్టాలు ఇచ్చారని, భూమి మాదేనని అక్రమంగా పొలంలోకి రావడంతో హరిజన ముత్తమ్మ 2015లో రాష్ట్ర అత్యున్నత న్యాయస్థానాన్ని ఆశ్రయించడంతో హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులు ఇచ్చి, సాగు చేస్తున్న వారిని ఇబ్బంది పెట్టరాదని ఆదేశాలు జారీచేసిందని తెలిపారు. 2022 డిసెంబర్ నెలలో తుది తీర్పును ముత్తమ్మకు అనుకూలంగా ఇచ్చిందన్నారు. ఈ తీర్పును ఆదోని సబ్ కలెక్టర్ కార్యాలయంలో స్పందనలో పై భూమికి పట్టాదారు పాసుపుస్తకాలు మంజూరు చేయాలని అర్జీ పెట్టుకోగా సబ్ కలెక్టర్ పరిశీలించి ఎంక్వైరీ రిపోర్టు ఇవ్వాలని మంత్రాలయం తహసీల్దార్ కు తెలిపారు. తహసీల్దార్ విచారణ పేరుతో వచ్చి గ్రామంలో కొందరిని మీకు పట్టాలు ఇస్తామని రెచ్చగొట్టడం జరిగిందన్నారు. బుధవారం పొలం లో ముత్తమ్మ కోడలు, కొడుకు పనులు చేస్తుండగా గ్రామంలోని కొందరు వ్యక్తులు ట్రాక్టర్ లో రాళ్లు వేసుకొని అక్రమంగా పొలంలోకి ప్రవేశించింది ప్లాట్ల కోసం రాళ్లు వేశారన్నారు. ఇదేమిటని ప్రశ్నిస్తే తహసీల్దారే రాళ్లు పాతుకోమని చెప్పారని, ఈ సంవత్సరం నీన్ను పొలంలోకి దిగకుండా చేస్తామని బెదరించారని తెలిపారు. హైకోర్టు ఆదేశాలను ధిక్కరించిన తహసీల్దార్ పైన, అలాగే పొలంలోకి అక్రమంగా ప్రవేశించిన ట్రాక్టర్ యజమాని బోయ వీరేష్ పై ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేయాలని లేనిపక్షంలో ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని హెచ్చరించారు.

# రైతులకు ఎకరానికి పంట సాగుకు పదివేలు ఇవ్వాలి

**విశాలాంధ్ర - కోడుమూరు :** రైతులకు పంట సాగుకు ఎకరానికి పదివేలు ఆర్థిక సాయం అందించాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు బి కృష్ణ డిమాండ్ చేశారు. బుధవారం మండలంలోని వర్కూరు గ్రామంలో ఏపీ రైతు సంఘం కరపత్రాలను సీపీఐ మండల కార్యదర్శి బి రాజు,పట్టణ కార్యదర్శి ఏ రాముడు,వర్కూరు రైతు సంఘం నాయకుల ఆధ్వర్యంలో రైతులకు కరపత్రాలను పంపిణి కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమానికి ఏ రాముడు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో కృష్ణ,రాజులు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతులను విస్మరించా రని, రైతులు పడుతున్న కష్టాలను పట్టించుకోవడంలేదని, ఆత్మహత్యలు పెరిగిపోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ విధానాల కారణంగా మన రాష్ట్రంలో ప్రతి రైతు దాదాపు రెండు లక్షల నుండి 3లక్షల దాకా రుణభారంతో ఉన్నారని పేర్కొన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు రైతులకు పండించిన పంటలకు కనీసం మద్దతు ధర ఇవ్వడంలేదని చెప్పారు. రైతులకు వ్యవసాయానికి అవసరమైన అన్నిరకాల విత్తనాలు, ఎరువులు పురుగు మందులు సబ్సిడీతో అందించాలన్నారు. వ్యవసాయ విద్యుత్ మోటర్లకు మీటర్లు బిగించాలని ఆలోచన ఉపసంహరించుకోవాలని, ఉచిత విద్యుత్ ప్రభుత్వం కొనసాగించాలని తెలిపారు. సీపీఐ పట్టణ సహాయ కార్యదర్శి మధు, నాగరాజు, రైతుసంఘం నాయకులు నాగరాజు,రాజు వర్కురు రైతు సంఘం నాయకులు కుళాయిల రాముడు,మునిస్వామి,మునెప్ప పాల్గొన్నారు.

**కోసిగి :** రైతులకు రాష్ట్ర ప్రభుత్వం ఎకరాకు పదివేల సాగు సహాయం చేయాలని స్థానిక సీపీఐ కార్యాలయం ముందు రైతు సంఘం ఆధ్వర్యంలో బుధవారం కరపత్రాలను విడుదల చేశారు.ఈ సందర్భంగా రైతు సంఘం తాలూకా అధ్యక్షుడు ఎం.గోపాల్ మాట్లాడుతూ మన రాష్ట్రంలో ప్రతి రైతు 2.45 లక్షల రూపాయల రుణ భారంతో ఉన్నారని, దేశంలో ఆత్మహత్యలలో మన రాష్ట్రం మూడో స్థానంలో ఉన్నదని వారిలో అత్యధికులు పేద రైతులు కౌలు రైతులే నన్నారు. సీపీఐ నాయకులు ఓంకార స్వామి, ఏఐఎస్ఎఫ్ తాలూకా అధ్యక్షులు వీరేష్, ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం నాయకులు నరసప్ప, రాజు,నాగరాజు,తిక్కయ్య,రాజేందర్ పాల్గొన్నారు.

**దేవనకొండ :** తెలంగాణలో రైతులకు పెట్టుబడి సహాయం కింద ఎకరానికి రూ.10వేలు ఇస్తుందని అదే తరహాలో ఏపిలో కూడా రైతుకు పెట్టుబడి సాయం ఇవ్వాలని ఏపి రైతుసంఘం జిల్లా సహాయ కార్యదర్శి ఎం.జగదీష్, మండల కార్యదర్శి శివశంకర్‌లు ప్రభుత్వాన్ని కోరారు. దేవనకొండ సచివాలయం ఎదుట ఏపి రైతు సంఘం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. వారు మాట్లాడుతూ ప్రభుత్వ విధానాల కారణంగా రాష్ట్రంలో రైతులు అప్పుల ఊబిలో కూరుకుపోవడంతో రైతు ఆత్మహత్యల్లో దేశంలో మూడో స్థానంలో ఉందన్నారు.వినతిపత్రంను ఎమ్పీఓ మల్లికారునకు ఇచ్చారు. రైతుసంఘం నాయకులు నాగరాజు, మహేష్, ఖాదర్, బడేసాబ్,మహేందర్, సింగాపురంవీరన్న, వంకాయల.షేక్షావలి, కొత్తపేట వీరన్న, గిడ్డయ్య, వీరేష్ రెడ్డి, వీరేష్, ఉరుకుందు లు పాల్గొన్నారు.

**నందవరం :** కేంద్ర,రాష్ట్ర ,ప్రభుత్వాలు ఎన్నికల ముందు రైతులకు హామీలు ఇచ్చి ఇప్పుడు రైతులను విస్మరించారని,రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు పంపన్న గౌడ్,అన్నారు. బుధవారం ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం ఆధ్వర్యంలో నందవరం మండలంలో కనకవీడు, ఇబ్రహీంపురం, కొట్టాల, మాచాపురం గ్రామాలలో రైతులకు సాగు సాయం ఎకరాకు 10,000 రూ. ఇవ్వాలని, కోరుతూ కరపత్రాలు ద్వారా ప్రచార కార్యక్రమం నిర్వహి ంచారు. రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు పంపన్న గౌడ్ మాట్లాడుతూ. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఎన్నికల ముందు హామీలు ఇచ్చి ఇప్పుడు రైతులను విస్మరించారని విమర్శించారని, కావున ఇప్పటికైనా రైతులకు సాగు సాయం ఖర్చుల కింద ఎకరాకు రూ.10,వేలు ఇవ్వాలని మరియు రైతు రుణమాఫీ ,ప్రతి రైతుకు రెండు లక్షల రూపాయలు మాఫీ చేయాలని, జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం వ్యవసాయానికి అనుసంధానం చేయాలన్నారు. అందులో భాగంగానే జూలై 3న సచివాలయ దగ్గర వినతిపత్రం ఇవ్వడం జరుగుతుందని,11న,మండల కేంద్రాలలో దీక్షలు చేయడం జరుగుతు ందని తెలిపారు. శాంతన్న,విజయ్ కుమార్, గిడ్డయ్య, మునిస్వామి,నరసింహులు, ఉరుకుంద, ఎల్లప్ప, పాల్గొన్నారు.

## శిక్షణా తరగతులను జయప్రదం చేయండి

**విశాలాంధ్ర - ఎమ్మిగనూరు :** సమరశీల ఉద్యమాల రథసారథి ఏఐఎస్ఎఫ్ రాయలసీమ జిల్లాల శిక్షణా తరగతులను జూలై 4,5,6 తేదీలలో మంత్రాలయంలో నిర్వహిస్తున్నామని వాటిని జయప్రదం చేయాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి శ్రీరాములు గౌడ్,జిల్లా సహాయ కార్యదర్శి విజేంద్ర, థామస్‌లు పిలుపునిచ్చారు. బుధవారం శిక్షణా తరగతులకు సంభందించిన కరపత్రాలను ఎమ్మిగనూరు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విడుదల చేశారు. వారు మాట్లాడుతూ దేశంలో, రాష్ట్రంలో విద్యారంగాన్ని పూర్తిగా కార్పొరేట్ వ్యక్తుల చేతుల్లోకి అప్పచెప్పి విద్యను మొత్తం ప్రైవేటీకరణ చేస్తున్నారన్నారు. దీంతో మధ్య తరగతి ప్రజలు చదువుకోవడం మానేస్తున్నారని దేశంలో విద్యారంగాన్ని అభివృద్ధి చేస్తున్నామని చెప్పి పాఠ్యపుస్తకాలలో రాజ్యాంగ చరిత్రను చేరిపేస్తున్నారని విమర్శించారు. రాష్ట్రంలో రేషనలైజేషన్ పేరుతో ఉన్న స్కూళ్లను కుదించి ప్రభుత్వ విద్యను ధ్వంసం చేస్తూ మిగులు ఉపాధ్యాయ పోస్టులు చూపిస్తున్నారని, అదేవిధంగా ఇంటర్మీడియట్ విద్యార్థులకు ఉచితంగా ఇవ్వాల్సిన పాఠ్యపుస్తకాలను కూడా విద్యార్థులే కొనుగోలు చేయాలని చెప్పడం ప్రభుత్వ విద్యపై చిత్తశుద్ధి ఏమాత్రం ఉందో అర్థం చేసుకోవచ్చని వారు తెలిపారు.నూతన జాతీయ విద్యావిధానం తీసుకొచ్చి విద్యార్థులపై రుద్దితే విద్యార్థులకు అర్థం కాక దిక్కుతోచని స్థితిలో ఉన్నారని, తక్షణమే ఎన్సీఈఆర్టీ పుస్తకాలలో ఉన్న పాఠ్య భాగాలు యధావిధిగా కొనసాగించాలని, దానిని వ్యతిరేకిస్తూ రాజీనామా చేసిన కూడా కేంద్రానికి సిగ్గులేకుండా ముందుకు వెళ్లడం మూర్ఖపు చర్య అని అన్నారు. జూనియర్ కళాశాల విద్యార్థులకు మిరే పుస్తకాలు కొనుక్కోండి అని ఆదేశా లు జారీ చేయడం చాలా దుర్మార్గపు ఆలోచన అని అన్నారు. విద్యారంగంలో వస్తున్న సమూల మార్పులపై చర్చించేందుకు జూలైలో రాయల సీమ జిల్లాల శిక్షణా తరగతులు మూడు రోజుల పాటు మంత్రాల యంలో నిర్వహిస్తున్నామని,ఈ శిక్షణా తరగతులకు విద్యావేత్తలు, మేధావు లు, వివిధ యూనివర్సిటీల ప్రొఫెసర్‌లు వస్తున్నారని, కావున విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొనాలని, ఈ మూడు రోజుల పాటు శిక్షణా తరగతులు విజయవంతం చేసేందుకు అన్ని వర్గాల సహకరించాలని కోరారు. కరపత్రాలు విడుదల చేసిన వారిలో ఏఐఎస్ఎఫ్ నాయకులు మునిస్వామి,ఖాదర్,ఈరేష్, సమీర్,ఉదయ్,చాంద్, నరసింహ,నాయుడు ,వీరేష్, సురేష్, బాబు, రవి, తదితరులు పాల్గొన్నారు.

## పశు భీమా పథకాలను చేయించుకోండి

**విశాలాంధ్ర - వెల్దుర్తి :** రైతులు వైయస్సార్ పశు భీమా పథకాన్ని చేయించుకోవాలని గోవర్ధనగిరి పశు వైద్య అధికారి శ్వేతా రాణి అన్నారు. వారు విలేకరులతో మాట్లాడుతూ తెల్లరేషన్ కార్డు కలిగిన రైతు 15 విలువచేసే పశువులకు మూడేళ్ల కాల పరిమితితో 192రూపాయలు చొప్పున భీమ చెల్లించాలి. తెల్ల రేషన్ కార్డు లేని రైతులయితే 400 రూపాయలు చెల్లించాలి. 30 వేల విలువచేసే పశువులకు మూడేళ్ల కాలపని అభివృద్ధి 384 రూపాయలు తెల్ల రేషన్ కార్డు లేని రైతులకు 960 రూపాయలు 30 వేల రూపాయల కంటే ఎక్కువ ధర ఉన్న పశువులకు అధనంగా 64% ప్రీమియం చెల్లించాలి. ఒక రైతు ఒక లక్షకు బీమా ప్రీమియం చెల్లించిన రాష్ట్ర ప్రభుత్వం 30 వేల వరకు మాత్రమే పరిహారాన్ని అందిస్తుంది గొర్రెలు మేకలకు సంబంధించిన తెల్ల రేషన్ కార్డు ఉన్న రైతులకు 6000 విలువచేసే ప్రీమియం ఒక గొర్రె మేకకు ఏడాదికి 36 రూపాయలు రెండేళ్లకు 54 రూపాయలు మూడేళ్లకు 75 రూపాయలు ప్రీమియం చెల్లించాలి. పెద్ద రైతులైతే ఏడాదికి ఒకదానికి 90 రూపాయలు రెండేళ్లకు 135 రూపాయలు మూడేళ్లకు 187 రూపాయలు చెల్లించాలి. గొర్రెలు మేకలు చనిపోతే బీమా కింద ఒక్కొక్క దానికి 600 రూపాయలు చొప్పున పరిహారం అందుతుందని అన్నారు. ప్రతి రైతు పశువులపై ఇన్సూరెన్స్ కట్టుకుని కట్టుకుంటే మంచిదని అన్నారు.

## వేదవతి ప్రాజెక్టు నిర్మాణం పై నిర్లక్ష్యం ఎందుకు...?

**విశాలాంధ్ర - చిప్పగిరి :** ఆలూరు నియోజకవర్గం హోలహర్వి మండల పరిధిలోని గూల్యం గ్రామ సమీపంలో వేదవతి ప్రాజెక్టు నిర్మించేందుకు తలపెట్టినప్పటి సంవత్సరాలు గడుస్తున్నప్పటికీ వేదవతి ప్రాజెక్టు నిర్మాణం పై నిర్లక్ష్యము ఎందుకని ప్రశ్నిస్తూ ఆలూరు నియోజకవర్గ ఎమ్మెల్యే ప్రాజెక్ట్ నిర్మాణ పనులపై దృష్టి సారించి ప్రభుత్వ దృష్టికి తీసుకొని వెళ్లి నిర్మాణ పనులు ప్రారంభించేందుకు తక్షణ చర్యలు చేపట్టాలని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి చిప్పగిరి లక్ష్మీనారాయణ కోరారు. బుధవారం గూల్యం గ్రామ సమీపంలో నిర్మించి తలపెట్టిన వేదవతి ప్రాజెక్టు పనులను కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి లక్ష్మీనారాయణ పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని వెనుకబడిన ఆలూరు నియోజకవర్గమును దృష్టిలో ఉంచుకొని గత ప్రభుత్వం తెలుగుదేశం పార్టీ వేదవతి ప్రాజె క్టు తీసుకొని వచ్చి నియోజకవర్గ ప్రజలకు సాగు, తాగునీరు సమస్య ను పరిష్కరించేందుకు రూ. 1942.38 కోట్లు మంజూరు చేయడం జరిగిందని,వైసిపి ప్రభుత్వం చేపట్టిన తర్వాత వేదవతి ప్రాజెక్టు నిర్మాణ పనుల కొరకు రూ.1600 కోట్లకు కుదించి హైద రాబాద్‌కు చెందిన మెగా ఇన్ ఫాస్ట్ క్లర్ కంపెనీకి అప్పగించింది. ప్రాజెక్టులు నిర్మించాలంటే ఒక కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమని కనుక రాష్ట్ర ప్రజలు కాంగ్రెస్ పార్టీని ఆదరించి పూర్వ వైభవాన్ని తీసుకురావాలని ఆయన తెలియజేశారు. కాంగ్రెస్ పార్టీ చిప్పగిరి మండల అధ్యక్షులు దేగలహాలు మంజునాథ్, హెూలగుంద వెంకటేష్, గూల్యం విజయ్ కుమార్, చిప్పగిరి కరెంటు గోవిందు, చిప్పగిరి వినోద్ కుమార్, కత్తి రామాంజనేయులు,యల్లప్ప,హెూలగుంద,హోలహర్వి రైతులు పాల్గొన్నారు.

## ధర్నాను జయప్రదం చేయండి

**విశాలాంధ్ర- ఆదోనిటౌన్ :** కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు సామాన్య ప్రజల నడ్డి విర్యల పెంచిన విద్యుత్ చార్జీల పెంపునకు నిరసనగా ఈనెల 30న విద్యుత్ కార్యాలయం ముందు జరుగు ధర్నాను జయప్రదం చేయాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు అజయ్ బాబు, సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు వెంకటేశులు పిలుపునిచ్చారు. బుధవారం సుందరయ్య భవన్లో ఏర్పాటుచేసిన సీపీఐ, సిపిఎం ముఖ్య నాయకుల సమావేశానికి సిపిఎం పట్టణ కార్యదర్శి లక్ష్మన్న అధ్యక్షత వహించారు. నాయకులు మాట్లాడుతూ గతంలో రెండు మూడేళ్లకోసారి విద్యుత్ ఛార్జీలు పెంచేవారిని అయితే మోడీ ప్రభుత్వానికి లొంగిపోయిన జగన్ ప్రభుత్వం ప్రతి నెల వంటగ్యాస్ లాగే విద్యుత్ ఛార్జీలు కూడా పెంచడానికి ఆదేశాలు ఇవ్వడం సిగ్గుచేటు అన్నారు. విద్యుత్ బిల్లులు కాకుండా ఫిక్స్ చార్జిలు, కస్టమర్ చార్జీలు, సర్‌చార్జీలు,విద్యుత్ ఛార్జీలు, సర్దుబాటు చార్జీలు, ఇలా రకరకాల పేర్లు పెట్టి జనాన్ని ఇబ్బందులకు గురి చేస్తున్నారన్నారు. పెరుగుతున్న విద్యుత్ ఛార్జీలకు నిరసనగా వామపక్ష పార్టీల ఆధ్వర్యంలో ఈనెల 30న జరుగు ధర్నాను జయప్రదం చేయాలని వారు కోరారు. ఈ సమావేశంలో సీపీఐ పట్టణ కార్యదర్శి ఎస్ సుదర్శన్, సీపీఎం మండల కార్యదర్శి లింగన్న, పట్టణ కార్యదర్శి వర్గ సభ్యులు గోపాల్, తిప్పన్న సీపీఐ మండల కార్యదర్శి కల్లుబావిరాజు, నాయకులు వెంకన్న, నాగరాజు, దస్తగిరి తదితరులు పాల్గొన్నారు.

## ఉత్తమ చెక్కు పంపిణీ

**విశాలాంధ్ర - కర్నూలు లీగల్ :** కర్నూలు నగరంలో ప్రభావవంతమైన విద్యార్థిగా ఎన్నికై,ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి చేతుల మీదుగా రూ.50,000/-ల చెక్కును తీసుకున్న రవీంద్ర కళాశాల డిగ్రీ తృతీయ సంవత్సరం చదువుతున్న నారాయణ అక్షర బుధవారం, పాణ్యం ఎమ్మెల్యే మరియు టీటీడీ ధర్మ కర్తల మండలి సభ్యులు కాటసాని రాంభూపాల్ రెడ్డి చేతుల మీదుగా చెక్కును పంపించేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి విద్యార్థి విద్యార్థులకు ఇలాంటివి చేయడం ఎంతో సంతోషకరమైన విషయం అన్నారు .భవిష్యత్తులో మీరు మంచి స్థాయిలో ఉండి బాగా చదువుకోవాలని వారు సూచించారు .ఎమ్మెల్యే కాటసాని రా భూపాల్ రెడ్డి విద్యార్థి అక్షర ను అభినందించారు.

## రైతులకు తప్పనిసరిగా బిల్లులు ఇవ్వాలి

**విశాలాంధ్ర - వెల్దుర్తి రూరల్ :** పట్టణంలోని స్థానిక రైతు భరోసా కేంద్రంలో కంద్రంలో నర్సరీ యజమానంతో సమావేశము నిర్వ హించారు. ఈ సమావేశంలో ఉద్యన అధికారి కర్నూల్ విజయలక్ష్మి మాట్లాడుతూ నర్సరీలో నిర్వహించవలసిన అన్ని రకాల రికార్డులను తప్పనిసరిగా నిర్వహించాలని ఆదేశించారు. నర్సరీ నుండి మొక్కలు తీసుకొన్న ప్రతి రైతుకు తప్పనిసరిగా బిల్లులు ఇవ్వాలి నర్సరీ చటం 30 (2010) ప్రకారము ప్రతి నర్సరీ యజమాని తప్పనిసరిగా లైసెన్స్ కలిగి ఉండాలన్నారు.నర్సరీ యజమానులు విత్త నములు కొనేటప్పుడు తప్పనిసరిగా బిల్లులు తీసుకొని వాటిని రిజిస్టర్‌లో నమోదు చెయ్యాలన్నారు.తనిఖీ అధికారులు వచ్చినప్పుడు రిజిస్టర్లు చూపించి సహకరించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ శాఖ అధికారి అక్బర్ భాష,గ్రామ ఉద్యాన సహాయకులు సాంబశివుడు,తదితరులు పాల్గొన్నారు.

## ప్రాజెక్టు పరిధిలోకి ఆస్పరిని చేర్చాలి

**విశాలాంధ్ర - ఆస్పరి :** వేదవతి ప్రాజెక్టు పరిధిలోకి ఆస్పరి మండలాన్ని చేర్చి మండలంలోని అన్ని గ్రామాలకు సాగు, త్రాగునీరు అందించాలని సీపీఐ మండల కార్యదర్శి విరుపాక్షి, రైతు సంఘం నాయకులు బ్రహ్మయ్య, ఉరుకుందప్పలు డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక తాసిల్దార్ కార్యాలయం ముందు సిపిఐ, ఏపీ రైతు సంఘం ఆధ్వర్యంలో ధర్నా కార్యక్రమాన్ని నిర్వహించారు. సీపీఐ పట్టణ కార్యదర్శి కృష్ణమూర్తి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో వారు మాట్లాడుతూ నియోజకవర్గంలో అత్యంత వెనుకబడిన మండలం ఆస్పరి మండలమన్నారు. ఈ ప్రాంతానికి సాగు, తాగు నీటికి ఎలాంటి అవకాశాలు కూడా లేవన్నారు. వేదవతి ప్రాజెక్టును ఎనిమిది టీఎంసీల సామర్థ్యంతో నిర్మించాలని ఆస్పరి మండలాని వేదవతి ప్రాజెక్టులకు చేర్చి మండలంలోని అన్ని గ్రామాలకు తాగు నీరు సాగునీరు ఇవ్వాలని డిమాండ్ చేశారు. వేదవతి ప్రాజెక్టును ఆస్పరి మండలానికి వర్తింపజేయాలని గతంలో సిపిఐ ఆధ్వర్యంలో నిర్వహించిన సంతకాల సేకరణ కార్యక్రమంలో ఉద్యోగులు, మేధావులు, రైతులు, యువకులు, ప్రజలు చేత సేకరించిన సంతకాల లిస్టును తాసిల్దార్ కుమారస్వామికి అందజేయడం జరిగింది. అలాగే గురువారం బిల్లేకల్ గ్రామం నుండి ఆస్పరి పట్టణం వరకు ప్రాజెక్టును ఆస్పరి మండలానికి వర్తింపజేయాలని డిమాండ్ చేస్తూ సిపిఐ ఆధ్వర్యంలో పాదయాత్ర నిర్వహిస్తున్నామని ఈ పాదయాత్రలో రైతులు, ప్రజలు, యువకులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. సీపీఐ, రైతు సంఘం నాయకులు హనుమంతు,వీరేష్ పాల్గొన్నారు.

## ఉపాధ్యాయులు సమయపాలన పాటించాలి

**విశాలాంధ్ర - కోసిగి :** మండలంలోని ఉపాధ్యాయులు సమయపాలన పాటించి విద్యార్థులకు అర్థమయ్యే విధంగా బోధించి విద్యార్థుల విద్యాభివృద్ధికి కృషి చేయాలని ఎంఈఓ నాగేశప్ప అన్నారు. బుధవారం మండల పరిధిలోని దుద్ధి,చిర్తనకల్ , మూగులదొడ్డి ప్రాథమిక పాఠశాలలను తనిఖీ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న పుస్తకాలను పూర్తి స్థాయిలో విద్యార్థులకు అందించాలన్నారు. అదేవిధంగా ఆయా పాఠశాలలో జరుగుతున్న నాడు నేడు పనులను మరియు మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించారు. ఏవైనా సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకువస్తే వాటిని పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు. తనిఖీకి వెళ్లిన మండల విద్యాధికారిని ఆయా గ్రామల సర్పంచులు,పాఠశాలల చైర్మన్లు శాలువా పూల మాలతో సత్కరించారు. క్లస్టర్ సీఆర్పీ యోహాన్ పాల్గొన్నారు.

## విద్యార్థులకు బహుమతులు ప్రధానం

**విశాలాంధ్ర - హొళగుంద :** రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆంధ్రప్రదేశ్ ఆర్థిక చేయూత జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు సందేశ, రాఘవేంద్రలకు మొదటి బహుమతి వచ్చిందని హెడ్మాస్టర్ నజీర్ అహ్మద్ బుధవారం తెలిపారు.కల్లూరు జిలా పరిషత్ ఉన్నత పాఠశాల, కర్నూలులో ఆల్ ఇండియా క్విజ్ ప్రోగ్రామ్ నిర్వహించారు. మొదటి బహుమతి పొందిన విద్యార్థులకు 10,000 నగదు బహుమతి మరియు యోగ్యత సర్టిఫికెట్లు అందజేయబడతాయి అని పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎన్ ఎం డి నజీర్ అహమ్మద్ అన్నారు.జిల్లా స్థాయిలో ప్రథమ బహుమతి పొందిన విద్యార్థులు జూలై 14న విశాఖపట్నంలో రాష్ట్ర స్థాయిలో పాల్గొంటారని క్విజ్ కార్యక్రమంలో విజేతలకు పాఠశాల ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయులు శుభాకాంక్షలు తెలిపారు.